# మాతృ హృదయం

రచన: ఎస్. కమలకుమారి

చిన్నయ్యగారికి ఒంట్లో బాగాలేదు. వాంతులు, విరేచనాలు అవుతున్నాయట. డాక్టరుగారు వచ్చేరన్నవార్త క్షణాలమీద ఆ పల్లెటూరంతా వ్యాపించింది. ఇంచుమించు ఊరిలోనిజనమంతా ఆ ఇంటిముందు గుమిగూడేరు.

సీతమ్మగారు పైట చెంగు నోట్లోపెట్టుకుని దుఃఖాన్ని దిగమ్రింగుతోంది.

డాక్టరుగారు తణికీచేసి 'ఇది కలరా! ఈపూట గడిస్తే ఫరవాలేదన్నారు.

కాని, ఆరోజు గడవనివ్వలేదు ఆయన. ఎనమండుగురు పిల్లన్ని భార్య కప్పగించి, ఇన్నాళ్లుగా తాను మోస్తున్న కుటుంబభారాన్ని భార్య భుజాలకెత్తి, తాను శాశ్వతంగా విశ్రాంతి తీసుకున్నాడు.

ఇంజెక్షను చేయటానికి వచ్చిన డాక్టరు పెదవి విరిచి బయటికి వెళ్లిపోయాడు.

అంతే, నిశ్శబ్ధంగా ఉన్న ఇల్లు ఒక్కసారిగా గగ్గోలు పెట్టింది.

సీతమ్మ అలాగే స్పృహతప్పి వెనక్కి వాలిపోయింది. 'నాన్నా' అంటూ పద్దెనిమిదేండ్ల వాసు భోరున ఏడ్వటం మొదలుపెట్టేడు. ఏడేళ్ళ రమేష్, తరువాత వరుసగావున్న సురేష్, ఉమ, పద్మ, లత, రమ ఆఖరివాడు మోహన్ జరిగిందేమిటో అర్ధంకాకపోయినా తల్లినీ, అన్ననీ ఆస్థితిలోచూసి వెక్కివెక్కి ఏడవసాగేరు.

ఏ బావిదగ్గర చూసినా, ఏ చెరువుదగ్గర చూసినా ఏ రచ్చబండదగ్గర చూసినా ఇదే చర్చ.

'పాపం! సీతమ్మకి రావలసిన కష్టంకాదే లచ్చీ.'

'అవును పార్వతీ! ఆయమ్మలాంటి వాళ్లు ఈకాలంలో ఉంటారంటావా' అంది లక్ష్మి. నీళ్ళబిందె భుజానికెత్తుకుంటూ.

'అందరికీ వైద్యం చేసేవాడు, తనకువచ్చిన జబ్బేమిటో తెలిసికోలేకపోయాడా' అని రచ్చబండమీద కూర్చొని రామన్న అంటే,

'బాగుంది. కాలం, ఖర్మం కలిసివచ్చినపుడు అంతే.' పాపం! ఆ కుటుంబం ఏమయిపోతుందో. అయినా, అంతా మన ఖర్మ! అనుభవించక తప్పుతుందా? తనకు తెలిసిన వేదాంతం ఒలకబోసేడు కరణం.

♦ ♦ ♦

సీతమ్మపరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఈపిల్లలు ఒకరా? ఇద్దరా? నలుగురికి ఎలా పెళ్ళిళ్ళు చేయడం? ఆయనా హాయిగా వెళ్లిపోయేరు. తను వీళ్ళని పెంచగలదా? ఎలా? ఏమిటి ప్రస్తుతకర్తవ్యం అని బాధపడే సీతమ్మకు ఇరుగు పొరుగువారి సానుభూతి భరించరానిదయ్యింది. ఈ ఇంట్లోగాని, ఈ ఊరిలోగాని ఉండటం దుర్భరమనిపించింది. పట్నంవెళ్ళి అక్కడే ఎలాగయినా కాలం గడపాలి అన్న స్థిరనిశ్చయానికి వచ్చింది. రాత్రికి రాత్రే అవసరమయిన సామానులన్నీ కట్టేసి, తెల్లవారగానే వాసునిపంపి వున్న రెండుగేదెల్నీ, అర యెకరం పొలాన్ని అమ్మించేసింది.

హఠాత్తుగా ప్రయాణమైన ఆ కుటుంబాన్నిచూసి,

'ఏమ్మా, నీకేం లోటు లేకుండా మేం చూస్తాంకదా? ఇప్పుడెందుకీ ప్రయాణం' అన్నాడు మునసబు ఆదరంగా.

'లేదు బాబూ! ఆయనతో గడిపిన ఈ ఇంట్లో ఆయన లేకుండా ఉండలేను' అంటూ కళ్ళు తుడుచుకుంది.

'మరి పట్నంలో అన్నీ చాలా ఖరీదుకదా? మీరెలాగ ఉంటారు?'

'బాబుగారూ! మీరేమీ అనుకోనంటే ఒకమాట అడుగుతాను.'

'అడుగమ్మా, మరేం ఫర్వాలేదు.'

'మరేం లేదు బాబూ! పట్నంలో మీకు తెలిసిన వారెవరైనావుంటే, మావాసుకి చిన్న పనేదయినా ఇప్పిస్తారేమోనని...'

'తప్పకుండా! దానేముంది. మా మేనత్తకొడుకు అక్కడ చిన్నఫరంలో గుమాస్తాగా వుంటున్నాడు. వాడికి ఉత్తరం రాసిస్తాను. తప్పకుండా ఉద్యోగం ఇస్తాడు. మీకు సహాయం చేయటంకంటే వేరే ఏం ఏంకావాలమ్మా నాకు.'

'సంతోషం బాబూ! మీ మేలు జన్మజన్మాలకి మరచిపోను' అంది సీతమ్మ.

తోట, దొడ్డి అమ్మగా వచ్చినడబ్బుతో పట్నంచేరి, యిల్లు అద్దెకి తీసుకొని మకాం పెట్టింది.

♦ ♦ ♦

మర్నాడు రామయ్య యిచ్చిన కాగితంతో క్రిష్ణా అండు కంపెనీకి వెళ్ళేడు వాసు.

మేనేజరుదగ్గరకు వెళ్లి ఆ కాగితం ఇచ్చేడు. ఆ ఉత్తరం చదివిన కృష్ణమూర్తి తృప్తిచెందినట్లు అతనిముఖమే చెప్పింది.

'అలా కూర్చోండి మిస్టర్ ...'

'వాసు.'

'వెరీగుడ్! అయితే ఈరోజు జాయినవుతారా?'

'మీ రెప్పుడు రమ్మంటే, అప్పుడే చేరతానుసార్.'

'ఓ. కే. ఐతే రేపు ఉదయం పదింటికి రండి. అప్లికేషన్ ఇప్పుడే రాసిచ్చెయ్యండి.'

అప్లికేషన్ రాసిచ్చి, థాంక్స సార్! వస్తా' అని మహదానందంతో యింటికివచ్చేడు వాసు.

ఈవిధంగా పదెనిమిదేండ్ల వాసు ఉద్యోగస్థుడయ్యేడు, నూటఎనభై జీతం. పనినిబట్టి ప్రమోషన్స వస్తాయని చెప్పేరు.

తెల్లగా, సన్నగా, నొక్కునొక్కుల జుత్తుతో, మెరిసిపడే కళ్ళతో, పెద్ద అందం లేకపోయినా ఆకర్షణీయంగా ఉండేవాడు వాసు.

వాసుని చూసేటప్పుడల్లా హాయిగా కాలేజీలో చేరవలసిన నాబాబుని ఎస్. ఎస్. ఎల్. సి. తోనే ఆపేసి కుటుంబభారాన్ని వాడినెత్తిన వేసేను కదా అని బాధపడేది సీతమ్మ. కాని గత్యంతరంలేని పరిస్థితి అది. నెల ఇట్టే గిర్రున తిరిగింది. 1-వ తేదీన జీతం అందుకున్న వాసు హాయిగా, సంతోషంగా బజారునుండి మిఠాయి పొట్లాలుకొని ఇంటికి తిరిగివచ్చేడు. వస్తూనే,

'అమ్మా...అమ్మా.'

'ఏం వాయనా! ఎందుకా ఆనందం.'

'ఇదిగోనమ్మా! నే తెచ్చిన తొలిజీతం' అంటూ జీతాన్ని తల్లికిచ్చి కాళ్ళకి నమస్కరించేడు.

'బాబూ' అంటూ అక్కున చేర్చుకుంది.

ఇంతలో ఏదో గుర్తుకి వచ్చినట్లు తల్లి ఒడిలోంచిలేచి, 'హేయ్. తమ్ముళ్లూ, చెల్లాయిలూ ఇలారండి. మీకు మైసూర్ పాకు, జిలేబీ తెచ్చేను.'

'మామంచి అన్నయ్య' అంటూ తలొక ముద్దూ ప్రజంటుచేసేరా పసివాళ్లు.

♦ ♦ ♦

వాసుని ఆఫీసుకి వెళ్ళనిచ్చి అపలు తెచ్చి విస్తళ్ళు కట్టేది సీతమ్మ.

ఒకరోజు సీతమ్మ ఆకులు కుడుతుంటే రమేష్‌వచ్చి, 'అమ్మా! అన్నయ్య డబ్బులు తెస్తున్నాడుగా? మరి... నువ్వెందుకమ్మా ఇవి కుడతావ్?'

'మరి మనం ఇంతమందిమి ఉన్నాంకదా! అన్నయ్య జీతం సరిపోదుగా?'

'అయితే, అన్నయ్య ఇంకా డబ్బులు తేలేడా? నేను మాత్రం బోల్డు డబ్బు సంపాదిస్తాను. నువ్వు ఆకులు కుడితే ఒప్పుకోను' అన్నాడు. సంభాషణానుగుణంగా అభినయిస్తూ.

'అలాగేలే కాని, నేను కుడుతున్నానని అన్నకి చెప్పకేం? చెప్పవుకదూ? నా బంగారుతండ్రి' అంటూ ముద్దుల వర్షం కురిపించింది.

ఇలా మూడేళ్లు గడిచాయి. వాసుజీతం రూ. 250 చేసేరు. రమేష్ ఫస్టుఫారానికి వచ్చేడు. తక్కినవాళు, కూడా ఒక్కొక్కక్లాస్ దాటుతున్నారు. ప్రస్తుతం తిండికి బట్టకి లోటులేదు. గాని, ముందుముందు పిల్ళపై చదువు కెలాగ అనుకొనేది సీతమ్మ.

ఆరోజు ఆదివారం.

వాసుకి సెలవు అవటంచేత తీరుబాటుగా కూర్చొని పేపరు చూస్తున్నాడు. ఇంతలో రమేష్ పరుగునవచ్చి, 'అన్నయ్యా! అన్నయ్యా!'

'ఏం రమేష్? ఏం కావాలి?'

'ఇవాళ మమ్మల్ని సినిమాకి తీసికెళ్ళవూ?'

నిజమే, చాలారోజులయి వాళ్ళ నెక్కడికీ తీసుకెళ్ళటంలేదు అనుకొని, 'సరే! అలాగే వెళ్దాం. అమ్మని కూడా రమ్మను' అన్నాడు వాసు.

'మామంచి అన్నయ్య' అంటూ తల్లిదగ్గరకు పరిగెత్తేడు రమేష్.

సీతమ్మ పనులన్నీ పూర్తిచేసుకుని చీర మార్చుకుంటూంటే నల్లటి 'ప్లిమత్' కారు వచ్చి ఆ యింటిముందాగింది.

మనింటికి కారు రావడమేమిటని ఆశ్చర్యపోయి కిటికీలోంచిచూసిన సీతమ్మ, ఆమె ఆశ్చర్యంనుండి తేరుకో

ముందే 'వాసుగారిల్లు ఇదేనాండి' అంటూ కారులోని వ్యక్తులు లోనికి వచ్చేశారు.

'ఆ ..ఆ...ఇదేనండీ, రండి...అంటూ, అమ్మా! ఒచ్చేరు చూడు' అని తల్లిని కేకేశాడు వాసు.

'ఆ...వస్తున్నానంటూ' పమిట సరిగా సర్దుకుని గది లోకివెళ్ళి వాళ్ళని చూసింది.

ఎర్రని అంచున్న నీలం పట్టుచీర, దానిమీద ఎర్ర బుటాలపట్టు జాకెట్టు వేసుకుంది. మెడనిండా నగలు, ఒకచేతికి బంగారుగాజులు, రెండవచేతికి మంచి స్క్వేర్ వాచీ పెట్టుకుంది. తలనిండా మల్లెలలో మంచి హుందాగా ఉంది. రెండవవ్యక్తికూడా చాలా హుందాగానే ఉన్నాడు. ఆమెభర్తని వేరే చెప్పనవసరం లేదుకదా?

వచ్చిందెవరో అర్థంకాక తెల్లబోయి చూస్తున్న సీతమ్మని ఆమె ముందుగా పలకరించింది.

'సీతమ్మతల్లీ నీవు రావలసిన కష్టం కాదమ్మా యిది. అన్నట్లు మమ్మల్ని నువ్వెరగవేమో లే? మీఆయన చిన్నయ్యకి నేను వేలువిడిచిన పినతల్లి ఆడబడుచుని. నీసంగతి తెలిసి ఎలా ఉన్నావో చూసిపోదామని వచ్చేము' అని ఆగి, భర్తవైపు చూసింది మాట్లాడమన్నట్లుగా మాణిక్యమ్మ.

గొంతు సవరించుకొని 'మీ ఆయనవలనే చనిపోయే స్థితిలోనున్న నేను బయపడ్డానమ్మా. ఆయన ఋణం ఈ జన్మలో తీర్చుకోలేము' అన్నాడు వెంకట్రామయ్య.

వారి వాక్ప్రవాహంలో మునిగిన సీతమ్మ అప్పటికి తేలి 'మీరాక మాకు చాలా ఆనందాన్ని కలిగించిందండీ. ఉండండి కాఫీ తెస్తాను' అని లోనికి వెళ్ళింది.

సినిమాకి వెళ్ళకుండా అడ్డుతగిలిన వీళ్ళెవర్రా అని పిల్లలందరూ తలోమూలకి తప్పుకున్నారు.


ELTEX

ఎల్‌టెక్స్

మోటారులు-పంపులు

*



వ్యవసాయిక, యంత్రపరిశ్రమల అవసరాలకు ఆదర్శప్రాయంగా ఉపకరిస్తాయి.

*

ఎలెక్ట్రిక్ మోటార్లను, పంపులను విరివిగా వాడి, సరకు ఉత్పత్తిని అభివృద్ధి పరచుకోండి.

తయారుచేయువారు :

ఎల్‌టెక్స్ ఇంజినీరింగ్ కార్పొరేషన్ (ప్రై), లిమిటెడ్.

కోయంబత్తూరు-6.

బ్రాంచి : తంబుచెట్టి వీధి, మదరాసు-1

డిస్ట్రిబ్యూటర్లు :

క్రిష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలు:- శేఖర్ అండు రావు, కోర్టు వీధి, విజయవాడ.

తూర్పు గోదావరి శ్రీకాకుళం, వైజాగ్:- శ్రీ శ్రీనివాస ఎంటర్ ప్రైసస్, రామచంద్రపురం.

తెలంగాణ, కర్నూలు:-కోయముత్తూరు ఇంజనీరింగ్ సర్వీస్, 39, రాష్ట్రపతిరోడ్డు, సికింద్రాబాద్

సీతమ్మ కాఫీ తెచ్చేలోగా ఆ యింటిపరిస్థితి పూర్తిగా అవగాహన చేసుకుంది మాణిక్యమ్మ.

సీతమ్మ అందిచ్చిన కాఫీ తాగుతూ...

'చల్లకొచ్చి ముంత దాచడమెందుకన్నట్లు మేము కేరేపనిమీద వచ్చేమమ్మా.'

'ఏమిటండీ అది?' వాసు ప్రశ్న.

'మాకు ఇంత ఆస్తిపాస్తులున్నా అనుభవించేవారు లేదు. అందుకని...'

'ఊ! అందుకని...' సీతమ్మ రెట్టించింది.

'మీపిల్లల్లో ఒకడిని మాకు దత్తత ఇస్తారేమో అని.' మాణిక్యమ్మమాట పూర్తికాకుండానే, 'వీల్లేదు! నా పిల్లలలో ఒక్కరినికూడా ఇవ్వడానికి వీల్లేదు! నేనివ్వను' అంటూ సహజమయిన మాతృప్రేమతో అరిచింది.

'నీబాధ మాకు తెలుసుతల్లీ. కన్నప్రేమ అట్లాంటిదే కాని, బాధ పడనంటె ఒకమాట చెబుతాను. ఈ చాలీచాలని డబ్బుతో పిల్లల్ని ఎంతవరకూ చదివిస్తారు. పెళ్లీ పేరంటం ఎలా చేస్తారు.'

సీతమ్మబుర్ర పనిచెయ్యటం ప్రారంభించింది.

పిల్లలందరూ ఒకరితర్వాత ఒకరు కళ్లముందు కన్పించసాగేరు.

'నిజమే, ఎలా పెంచి పెద్దవాళ్లనిచేయడం?' అప్రయత్నంగా అంది.

'అందుకే మీ రెండోవాడిని మాతో పంపండి. వృద్ధిలోకి వస్తాడు' అన్నారు వెంకట్రామయ్యగారు.

'అమ్మా! ఒకసారి ఇలారా' అంటూ గదిలోకి వెళ్లేడు వాసు. వాసు వెనకాలే 'మరబొమ్మ'లా యాంత్రికంగా వెళ్ళింది.

'చూడమ్మా, వాళ్లు చెప్పింది అక్షరాలా నిజం. రమేష్ చాలా చురుకయినవాడు. వృద్ధిలోకి వస్తాడు, ఒప్పుకోమ్మా. వాణ్ణి పంపడానికి ఒప్పుకో. కనీసం వాడయినా బాగుపడనీ.

'అలాగేలేరా! వాడి అదృష్టం ఎలావుంటే అలా జరుగుతుంది' అంటూ కళ్లు తుడుచుకుంది.

సీతమ్మ అంగీకారాన్ని వాళ్ళు వరంలా స్వీకరించేరు.

'అమ్మా, నేవెళ్ళను' అని ఏడుస్తున్న రమేష్‌కి బిస్కట్లు, కేకులు, బట్టలు యిచ్చి మరిపించేరు. తక్కినపిల్లలకి కూడా చాక్లెట్ డబ్బాలు, బిస్కట్ ప్యాకెట్లు ఇచ్చి రమేష్‌తో కారులో వెళ్ళిపోయేరు.

రమేష్‌లేని యిల్లు దేముడులేని దేవాలయంలా ఉంది వాళ్ళకి. చురుకుగా నవ్వుతూ నవ్వించే రమేష్‌లేని లోటు మరిచిపోలేకపోయేరు.

కాలానికిమాత్రం చాలా శక్తులున్నాయి. కొన్ని గాయాలుమాత్రమే డాక్టర్లు మాగుచేస్తారుగాని, కాలం అన్నిరకాలగాయాలు మాన్పగలదు. అలాగే రమేష్‌లేని లోటును కాలక్రమేణా అందరూ మరచిపోగలిగేరు. మధ్య మధ్య అందరూ వెళ్లి చూసొచ్చేవారు.

♦ ♦ ♦

కాలచక్రం గిర్రున తిరిగింది. వాసుకి పెళ్ళయింది. మూడువందలు జీతం. అయినా జీవితం ఎప్పటిలాగే ఉంది.

రమేష్ పెద్దవాడయ్యేడు. ప్రస్తుతం బి. ఏ. చదువుతున్నాడు. కానీ ఈ రమేష్ మునపటి రమేష్ కాదు. తాను పుట్టటమే శ్రీమంతులబిడ్డగా పుట్టినట్లు భావిస్తున్నాడు. తనవాళ్ళు కొందరున్నారనిగాని, తనని నవమాసాలు మోసి కనిపెంచిన తల్లి ఉందనికాని మరచిపోయేడు. తన షోకులు, తన చదువు, నగలని బట్టలతో గర్ల్‌ఫ్రెండ్స్‌తో తిరగడమే రమేష్‌పని.

రెండుమూడుసార్లు వాసు కనిపించి మందలించబోతే ముఖం తప్పించి తిరగసాగేడు.

♦ ♦ ♦ ♦

వాసుతెచ్చే జీతం చాలక ఇబ్బందిపడుతున్న సమయంలో వాసుకి తెలీకుండా రమేష్‌దగ్గరికి వెళ్లింది సీతమ్మ. దురదృష్టవశాత్తు ఆరోజు మాణిక్యమ్మ, వెంకట్రావు ఇద్దరూకలిసి 'కాకినాడ' వెళ్ళేరు. రమేష్ ఏదో డిటెక్టివ్ చదువుతున్నాడు.

సీతమ్మ గదిలోకి వెళ్ళేసరికి రమేష్ ఒక్కడే కన్పించేడు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.

'బాబూ! రమేష్! అమ్మా, నాన్నా లేరా?'

'లేరు! ఏం? ఎందుకు?' ఆసమయంలో ఆవిడ రావడం ఇష్టంలేనట్లు ముఖం చిట్లించి.

'పోనీలేగాని, తమ్ముడికి కాలేజీ ఫీజు కట్టాలి ఒక 200 రూ. సర్దగలవా?'

'హూఁ, అంత ఫీజుకట్టే స్తోమత లేనివాళ్లు, కాలేజీ చదువులు చెప్పించడమెందుకో?' కాలేజీలో తమ్ముడు అన్నింటిలో తనకంటె బాగున్నాడన్న ఉక్రోషం ఆ మాటలో ప్రతిధ్వనించింది.

'ఉన్నమాటే అన్నాను. నన్ను పెంపకానికి యిచ్చినపుడు లేని అభిమానం, డబ్బు కావలిస్తే వచ్చిందా? అయినా నేనెందుకివ్వాలి, ఇవ్వను' అన్నాడు పొగరుగా.

నిశ్చేష్టయిపోయింది సీతమ్మ. 'అవునురా, నిజమే! నిన్ను పెంపకానికి యిచ్చి జీవితంలో పెద్ద పొరపాటు చేసేను. చదివి వృద్ధిలోకివస్తావని తలచి, కన్నప్రేమను కాదని నిన్ను పెంపకానికి యిస్తే, నా మాతృత్వాన్నే శంకిస్తావురా దుర్మార్గుడా? కాని, ఈడబ్బు, ఈహోదా, ఏవీ నీప్రాణం కాపాడవు. కన్నప్రేమముందు అన్నీ గడ్డిపోచతో సమానమే. నీముఖంచూస్తేనే పాపం. మళ్ళీ నీగడపతొక్కితే చూడు' అని విసురుగా వెళ్ళిపోయింది.

నిర్లక్ష్యంగా తల ఎగరేసి బయటికి వెళ్ళిపోయేడు రమేష్.

♦ ♦ ♦ ♦

తనకు చెప్పకుండా వెళ్ళి అవమానించబడివచ్చిన తల్లిని మందలించాలో, ఓదార్చాలో అర్థంకాలేదు వాసుకి.

ఆతర్వాత రెండు మూడుసార్లు పిలిచినా ఏదో సాకు చెప్పి వెళ్లడం మానేసింది సీతమ్మ.

కాలం మరికొంతదూరం సాగింది. రమేష్ ప్రవర్తనకి ఆ దంపతులిద్దరూ చాలా బాధపడ్డారు. వివాహంచేస్తే మారతాడేమోనన్న ఉద్దేశ్యంతో అతనికి వివాహంచేయ నిశ్చయించేరు. నాకు పెళ్ళి ఒద్దు అని ముందు మొండికేసినా శారద అందంచూసి తనపట్టు సడలించేడు. వివాహంకూడా ఘనంగా జరిగిపోయింది.

'మేము తిరుపతి వెళ్ళాలి' అంటూ పెళ్ళికి రాకుండా తప్పించుకుంది సీతమ్మ.

కొడుకు పెళ్ళికికూడా రాలేదంటే ఏదో కారణం ఉండిఉండాలి అనుకున్నారా దంపతులు.

పెళ్ళి అయ్యాకకూడా చదువేమిటని ఒక ఉద్యోగం అవసరంలేక చేయడం మొదలుపెట్టేడు రమేష్.

తల్లి, తోడబుట్టినవాళ్లు తన పెళ్లికి రాలేదన్న బాధ ఏకోశానా లేదు రమేష్‌కి.

ఒకనాడు తండ్రి రమేష్‌ని నిలదీసి 'మీ అమ్మగారు ఇక్కడి కెందుకు రావడంలేదు? నువ్వేం చేసావ్ చెప్పు' అని నిలదీస్తే, నసుగుతూ అసలుసంగతి చెప్పేడు.

వెంకట్రావుగారు మండిపడ్డారు కోపంతో. 'నీకిదేం పాడుబుద్ధిరా? నీకోసం ఆమె త్యాగంచేస్తే, నానా మాటలు అని ఆమెని బాధపెడతావా? బుద్ధిలేదు' అని కేకలేస్తే రమేష్ ఏం మాట్లాడలేదు.

ఆనాడు రమేష్ జీతం అందుకున్నాడు. ఎంత ఆశి ఉంటేనే, ఇది నాస్వార్జితం అన్న ఉత్సాహంతో బజారుకివెళ్ళి బిస్కెట్, కలర్ జరీచీర కొన్నాడు శారదకి. త్రోవలో వస్తూవస్తూ మల్లెలు, గులాబీలు పొట్లం కట్టించేడు. ఆచీర కట్టుకుని, జారుగా అల్లిన పెద్దజడలో ఆ

మీ ఆభరణములకు
అతి శ్రేష్ఠమయినది
సవరన్ మార్కు
REGISTERED-TRADE-MARK
No:115228
పారీస్ వజ్రములు
వివరములకు
PARIS DIAMOND WORKS
207.D.BIG BAZAR
TIRUCHIRAPALLI—8
పారిస్ డైమండ్ వర్క్సు
207.డి.బిగ్ బజారు
తిరుచురాపల్లి—8

మత్తులు కలిగించే అందాన్ని, శారద సోగకన్నుల్ని తలచుకుంటూ స్కూటర్‌పై నెమ్మదిగా మనోవీధిలో తేలుమావస్తున్న రమేష్ అదేపనిగా కొడుతున్న కారు హారనుకి తృళ్ళిపడి దాన్ని తప్పించుకోబోయి, వెనుక నుండివస్తున్న మరో కారుక్రింద పడ్డాడు. అతను కొన్న చీర రక్తపుమడుగులోపడి రక్తవర్ణం దాల్చింది. మల్లెలు ధూళిలో దొర్లిపోయేయి. ఆకారులోనివ్యక్తి రమేష్‌ని వెంటనే (బ్యాక్ సీట్)లో వేసి హాస్పిటల్‌వైపు పోనిచ్చేడు.

ఎవరో రమేష్‌ని తెలిసినవ్యక్తి, 'పాపం! వాళ్ళకి ఈ ఒక్కడే పిల్లాడు. అయినా రెండుకార్లున్న వ్యక్తి, స్కూటరుపై రావడమేమిటి, ఒచ్చినా కారుక్రింద పడ్డమేమిటి, ఖర్మ కాకపోతే' అని ఆసంగతి వెంకట్రావు గారికి తెలియచేయడానికి వెళ్ళేడు.

కబురు తెలిసిన వెంకట్రావు, మాణిక్యమ్మ, శారదలు హుటాహుటీగా వచ్చిపడ్డారు.

'బాబూ! నీకేమయిందిరా! మమ్మల్ని అన్యాయం చెయ్యకండీ అంటూ, మాణిక్యమ్మ, శారదలు ఘోరున విలపించసాగేరు.

'హుంష్! గొడవపెట్టకండి' అంటూ డాక్టరు వచ్చి ఇంజక్షన్ చేసేడు. తరువాత వెంకట్రావువైపు తిరిగి 'అబ్బాయికి చాలా బలమయినగాయాలు తగిలేయి. బ్లడ్ చాలాపోయింది. బ్లడ్ బాంక్‌లో బ్లడ్ లేదు. ఎవరైనా బ్లడ్ యివ్వాలి అన్నాడు.

'నారక్తం పనికి వస్తుందేమో చూడండి' అంటూ అందరూ ముందుకి వచ్చేరు.

కాని, మాణిక్యమ్మకి, వెంకట్రావుకి బ్లడ్ ప్రెషర్, డయాబిటిస్ ఉండటంవల్ల ఆరక్తం పనికిరాలేదు. శారద అప్పుడు గర్భిణి. అసలే నీరసంగా ఉందని ఆమెరక్తం వద్దన్నారు.

ఇక ఎవరు? ఎవరున్నారు? మాబాబు మాకుదక్కడా అని మధనపడుతున్న సమయంలో డ్రైవరు తీసికెళ్ళిన కారులో సీతమ్మ, వాసు ఒచ్చేరు.

రమేష్‌ని ఆ స్పృహలేని పరిస్థితిలో చూసిన ఆ మాతృహృదయం గగ్గోలుపెట్టింది. ఇంతకుముందు ఆడినమాటలు గాని, జరిగినదృశ్యాలుగాని గుర్తులేవు. తను నవమాసాలు కనిపెంచిన కొడుకు చావుబ్రతుకులమధ్య ఊగిసలాడుతూండటమే కనిపించింది.

'డాక్టరుగారూ! నాకొడుకుని ఎలా కాపాడతారో మీదే భారం. నారక్తం చూడండి. సరిపోతే తీసుకోండి. నేనేమయినా ఫరవాలేదు అంటూ ఏడ్వసాగింది.

కంగారుపడకండి అంటూ ఆమెరక్తం పరీక్షించేడు. సరిగా సరిపోయింది అంటూ సంతోషంగా ఆమెరక్తాన్ని రమేష్‌కి ఎక్కించేడు. (అవును మరి కన్నతల్లిరక్తం సరిపోదా?)

మర్నాడు రమేష్‌కి తెలివివచ్చేసరికల్లా మగతగా మరో మంచంమీదున్న తల్లి కనిపించింది.

'అమ్మా! ఏమిటిది? ఏం జరిగింది? అంటూ గభాలున లేవబోయేడు.

'ఏమండీ, మీరు కదలకండి. కుట్లు కదులుతాయి. మీ అమ్మగారు ఆమెరక్తం ధారపోసి మిమ్మల్ని బ్రతికించుకున్నారు. ఆ త్తయ్య ఋణం ఈ జన్మలో తీర్చుకోలేము' అంటూ సరిగా కప్పి పడుకోబెట్టింది.

రమేష్ ఆశ్చర్యపోయాడు, 'నిజమా శారదా! అమ్మ నిజంగా దేవత! ఆ తల్లిప్రేమను తెలిసికోలేక ఆవిడని నా మాటలతో బాధపెట్టేను. అమ్మ అన్నట్లు నాడబ్బు, నా హోదా, నన్ను కాపాడలేదు. అమ్మ మమకారమే నన్ను బ్రతికించింది. 'అమ్మా! ఈ నీ కృతఘ్నుడయిన కొడుకుని మన్నించమ్మా' అంటూ మగతగా ఉన్నతల్లినిచూసి కళ్ళు ముడుచుకున్నాడు.

వాసు, మాణిక్యమ్మ, శారద, వెంకట్రావులు రమేష్‌లో వచ్చిన ఈ మార్పుకి ఆనందించి, ఆ వెంకటేశ్వరునికి మనసులోనే కృతజ్ఞత అర్పించేరు.

